పేదల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం

ఖలీల్‌వాడి, ఆగస్టు 4 : పేదల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని, పోరాటాలతో సమస్యలను పరిష్కరించుకోగలగుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు అన్నారు. సభ్యుడు పెద్ది వెంకట్రామ్ అధ్యక్షతన సీపీఎం కార్యాలయంలో నగర కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పేదలకు అవసరమైన కూడు, గూడు, గుడ్డ కల్పించడంలో సరైన విధానాలు అనుసరించకపోవడంతో ఉపాధి అవకాశాలు తగ్గి, పేదరికం పెరిగిపోతుంద అన్నారు. సమావేశంలో నాయకులు సుజాత, విఘ్నేశ్, రాములు, అనసూయ, నర్సయ్య, లక్ష్మి, గోవర్ధన్, శంకర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

డిచ్‌పల్లి, ఆగస్టు 4 : భిక్కనూర్ సౌత్ క్యాంపస్‌కు చెందిన విద్యార్థి ప్రీతం శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం బాధాకరమని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని యూనివర్సిటీ గిరిజన శక్తి అధ్యక్షుడు శ్రీనూరాథోడ్ కోరారు. ఉన్న ఒక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. బాధిత కుటుంబానికి 25 లక్షల ఎక్స్‌గ్రేషియా, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని కోరారు. రోడ్డుప్రమాదాల బారిన పడకుండా క్యాంపస్ నుంచి రోడ్డు దాటేందుకు బ్రిడ్జిని నిర్మించాలని కోరారు.

' శ్వేత పత్రం విడుదల చేయాలి'

ఖలీల్‌వాడి, ఆగస్టు 4: దళితుల జీవన స్థితిగతులపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంగిరి ప్రదీప్ ఒక ప్రకటనలో కోరారు.తెలంగాణ రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల జాబితాలో పొందుపరిచిన 59 కులాల విద్య, ఉద్యోగ, జనాభా, ఆర్థిక రంగాలకు సంబంధించి దళిత జీవన స్థితిగతులపై ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

కంఠేశ్వర్, ఆగస్టు 4: నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. ఆదివారం ఆయన నగరంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద నగరానికి రూ. 10 కోట్ల నిధులు తెచ్చామని తెలిపారు. ఈ నిధులను పలు డివిజన్లలో సీసీ రోడ్డు, డ్రైనేజీ, కమ్యూనిటీ భవనాలు, ప్రహరీల నిర్మాణం, అభివృద్ధి పనులకు ఉపయోగిస్తామని వివరించారు. త్వరలో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, ప్లాట్లు ఉన్నవారికి ఇల్లు కట్టుకోవడానికి రూ. 5 లక్షలు మంజూరుచేస్తామన్నారు. బోధన్‌రోడ్డులోని లిమ్రా గార్డెన్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని పదో తరగతి, నీట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను సన్మానించారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

నగరంలో ఇటీవల ఐదేండ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడు గంగాధర్‌ను కఠినంగా శిక్షించాలని షబ్బీర్ అలీ అన్నారు. బాలిక తల్లిదండ్రులు ఆదివారం షబ్బీర్ అలీని కలిసి నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరారు. తాము నిరుపేదలమని, ఆర్థిక సాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. స్పందించిన షబ్బీర్ అలీ వెంటనే సీపీతో ఫోన్‌లో మాట్లాడి నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మాతా శిశు సంక్షేమ శాఖ అధికారితో మాట్లాడి బాధితులకు తక్షణ సాయం అందించాలని ఆదేశించారు.

ఘనంగా బోనాల పండుగ

సుభాష్‌నగర్, ఆగస్టు 4 : వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని కోరుతూ భక్తులు అమ్మోరు తల్లికి ఆదివారం బోనాలు సమర్పించారు. ఆషాఢమాసం చివరి ఆదివారం జిల్లా వ్యాప్తంగా బోనాల ఊరేగింపు నిర్వహించారు. డప్పువాయిద్యాలు, యువకుల నృత్యాలు, పోతరాజుల విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. గ్రామదేవతలకు భక్తి ప్రపత్తులతో నైవేద్యం సమర్పించారు. సామూహికంగా వనభోజనాల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచే గ్రామదేవతల దర్శనం కోసం బారులు తీరారు. నగరంలో దేవీరోడ్‌లో ఉన్న దేవీమాత, పోచమ్మగల్లీ పెద్దపోచమ్మ, ఎల్లమ్మ, కోటగల్లీ, మైసమ్మ, వినాయక్‌నగర్‌లోని మత్తడిపోచమ్మ, మహాలక్ష్మమ్మ తదితర మందిరాల్లో భక్తులు పూజలు చేశారు. వివిధ సంఘాల ఆధ్వర్యంలో బోనాలను ఊరేగించారు. నగర మేయర్ దండు నీతూకిరణ్, కార్పొరేటర్లు, కాలనీ మహిళలు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

బోనమెత్తుకున్న నగర మేయర్ నీతూకిరణ్

మండలంలో జోరుగా ఇసుక దందా

పొతంగల్, ఆగస్టు 4: మండలంలో ఇసుక దందా జోరుగా కొనసాగుతున్నది. అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నా ఇసుక మాఫియా తన పని తాను చేసుకుంటూ పోతున్నది. మండల పరిధిలోని హంగర్గాఫారం వద్ద ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు ఆదివారం సీజ్ చేశారు. గడిచిన పదిహేను రోజుల్లో మూడుసార్లు ఇసుక డంపులను సీజ్ చేయడం గమనార్హం. సీజ్ చేసిన ఇసుక డంపులకు తహసీల్దార్ కార్యాలయంలో నేడు ఉదయం వేలం వేయనున్నట్లు తహసీల్దార్ మల్లయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

'చలో అమృత్‌సర్' పోస్టర్ల ఆవిష్కరణ

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీసీ ఉద్యోగుల సంఘం సభ్యులు

ఖలీల్‌వాడి, ఆగస్టు 4 : దేశవ్యాప్తంగా ఓబీసీలను ఏకం చేస్తూ బీసీల డిమాండ్లను సాధించే దిశగా ఈనెల 7న అమృత్‌సర్‌లో మహాసభ నిర్వమించనున్నట్లు బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కరిపె రవీందర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం బీసీ సంఘం అధ్యక్షుడు నరాల సుధాకర్, ఆకుల ప్రసాద్‌తో కలిసి ఆవిష్కరించారు. బీసీ ఉద్యోగులందరూ ఐక్యంగా పోరాటాలు చేసి, హక్కులు, డిమాండ్లను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్‌లో రిజర్వేషన్లు కల్పించాలని, క్రిమిలేయర్ రద్దు చేయాలని, బీసీలకు అట్రాసిటీ కేసు నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు చిట్టి నారాయణరెడ్డి, ప్రధానకార్యదర్శి చంద్రమోహన్, కోశాధికారి విఠల్, ప్రభాకర్, కార్యవర్గసభ్యులు సుమన్, శ్రీధర్, సంక్షేమ సంఘం నాయకులు కోయాడ శంకర్, బసవరాజ్, దర్శనం దేవేందర్, బాలయ్య పాల్గొన్నారు.

కాసర్లకు సినారె పురస్కారం

ఆగస్టు 4, సుభాష్‌నగర్ : నగరానికి చెందిన ప్రముఖ కవి, రచయిత డాక్టర్ కాసర్ల నరేశ్‌రావుకు రాష్ట్రస్థాయి సినారె పురస్కారానికి ఎంపికనట్లు మహాకవి సినారె కళాపీఠం అధ్యక్షుడు మల్లెకేడి రాములు ఆదివారం పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ పురస్కారాన్ని ఈనెల 10న హైదరాబాద్ రవీంద్ర భారతీలో నిర్వహించే కార్యక్రమంలో అందజేస్తామని పేర్కొన్నారు. కాసర్ల నరేశ్ వృత్తిరీత్యా తెలుగు ఉపాధ్యాయుడిగా మోపాల్ మండలం సిర్పూర్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు. మూడు దశాబ్దాలుగా ఇందూరు జిల్లా సాహిత్య క్షేత్రంలో సేవలందిస్తున్నారు.

రుణమాఫీకి లేనిపోని షరతులు సరికాదు

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ నాయకుడు యెండల ఆగ్రహం

చందూర్‌లో మాట్లాడుతున్న యెండల

చందూర్, ఆగస్టు 4: కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో రుణమాఫీ చేస్తామని ప్రకటించి, అధికారంలోకి వచ్చాక లేనిపోని షరతులు విధిస్తున్నదని బీజేపీ నాయకుడు యెండల లక్ష్మీనారాయణ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆదివారం ఆయన చందూర్ మండలం కేంద్రంలో నిర్వహించిన పార్టీ మండల కార్యవర్గ సమావేశంలో పాల్గొన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఏప్రిల్‌లో కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఇప్పటివరకూ పరిహారం అందలేదన్నారు. రైతు కూలీలకు రైతుభరోసా కింద ఇస్తామన్న రూ. 12వేలు ఎటుపోయాయని ప్రశ్నించారు. ఇప్పటి వరకు రైతుబంధు ఇవ్వకపోగా రూ. 10వేల నుంచి రూ. 15వేల వరకు పెట్టుబడిసాయం ఎప్పుడు పెంచుతారో సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు.రైతుబంధు నిధులు దారి మళ్లించి రుణమాఫీ పేరిట లేనిపోని నిబంధనలు పెట్టి రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. రుణ మాఫీ కాని రైతులు ఎవరిని అడగాలో తెలియని పరిస్థితిలో ఉన్నారని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు.

కండక్టర్‌ను దూషించిన వ్యక్తిపై కేసు

సిరికొండ, ఆగస్టు 4: మండలంలోని గడ్కోల్ గ్రామానికి చెందిన లింగం ఆనే వ్యక్తి ఆర్డీసీ కండక్టర్‌పై దాడి చేసినట్లు ఏఎస్సై బాల్‌సింగ్ ఆదివారం తెలిపారు. శనివారం సాయంత్రం భీమ్‌గల్ నుంచి కామారెడ్డి వెళ్తున్న బస్సు (టీఎస్17టీ5459)ను కొండాపూర్ గ్రామశివారులో ఆపి తన కూతురుకు ఎందుకు టికెట్ తీసుకున్నావంటూ కండక్టర్ కప్ప వెంకటేశంతో లింగం వాగ్వాదానికి దిగినట్లు పేర్కొన్నారు. తనను అసభ్యపదజాలంతో దూషించాడని, తన విధులకు ఆటంకం కలిగించాడంటూ కండక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఏఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది వివాహిత ఆత్మహత్య

వినాయక్‌నగర్, ఆగస్టు 4: నిజామాబాద్ నగరశివారులోని ముబారక్ నగర్‌కు చెందిన ఓ వివాహిత జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడింది. హోలియ రూప(35)కు భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భర్త రమేశ్ కుటుంబ పోషణ నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. తన పిల్లలతో ఇక్కడే ఉండే రూప కొంత కాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిసింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన ఆమె శనివారం తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం కోసం జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.తండ్రి గల్ఫ్‌లో ఉండగా.. తల్లి ఆత్మహత్యకు పాల్పడడంతో అనాథలైన ముగ్గురు పిల్లలను చూసి స్థానికులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

మండల కేంద్రంలోని సత్యశోధక్ పాఠశాలలో ఆదివారం స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు 'హ్యాపీ ఫ్రెండ్‌షిప్ డే' అనే ఆంగ్ల అక్షరాల ఆకృతిలో కూర్చొని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

–సిరికొండ, ఆగస్టు 4

గ్రామదేవతలకు ముడుపులు

ధర్పల్లిలో గ్రామదేవతలకు పూజలు చేస్తున్న వీడీసీ సభ్యులు

ధర్పల్లి, ఆగస్టు 4 : శ్రావణమాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని ధర్పల్లిలో వీడీసీ ఆధ్వర్యంలో గ్రామదేవతలకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న గ్రామదేవత విగ్రహాలకు పూజలు చేసి, గ్రామశివార్లలోని ఆలయాల వద్ద ముడుపులు వేశారు. శ్రావణమాసం ముగిసిన తర్వాత ముడుపులు తీసి మొక్కులు చెల్లించనున్నట్లు వీడీసీ సభ్యులు తెలిపారు.

దొన్కల్‌లో జలాభిషేకం

ఇందల్వాయి, ఆగస్టు 4 : దొన్కల్ గ్రామంలో ఆదివారం గ్రామదేవతలకు వీడీసీ ఆధ్వర్యంలో జలాభిషేకం నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ప్రార్థించారు. అనంతరం బలిహరణం చేసి వనభోజనాలకు తరలివెళ్లారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విఠల్‌రెడ్డి, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **టీయూలో టీమ్ స్పిరిట్ ఈవెంట్:** డిచ్‌పల్లి, ఆగస్టు 4: టీయూ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లో ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఐఎంబీఏ విద్యార్థులు టీమ్ స్పిరిట్ గేమ్స్ నిర్వహించారు. విజేతలుగా సాయికుమార్, వినీల, భాగ్యశ్రీ, తుశ్యంత నిలిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆచార్య ఆంజనేయులు హాజరై ఈవెంట్ మేనేజర్లు కోటూరి శ్వేత, రసజ్ఞ, మెగావత్ లావణ్యను అభినందించారు.
- **వాహనాల తనిఖీ:** రుద్రూర్, ఆగస్టు 4 : మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఎస్సై అప్పారావు సిబ్బందితో కలిసి ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని పలువురు వాహనదారులకు జరిమానా విధించారు.
- **వాహనాల అద్దాలు ధ్వంసం:** సిరికొండ, ఆగస్టు 4: మండలంలోని న్యావనంది గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి రెండు వాహనాల అద్దాలను ధ్వంసం చేశారని ఏఎస్సై బాల్‌సింగ్ ఆదివారం తెలిపారు. గ్రామంలోని మామిడిపల్లి లింబాద్రి, పిట్ల సాయికుమార్‌కు చెందిన వాహనాల అద్దాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వసం చేశారని ఇద్దరు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.
- **ఏఈవో బదిలీ:** కోటగిరి, ఆగస్టు 4: కోటగిరి మండలం కొత్తపల్లి క్లస్టర్ ఏఈవో గౌస్ రాంపూర్ క్లస్టర్‌కు బదిలీ అయ్యారు. కొత్తపల్లి క్లస్టర్‌కు మోస్రా క్లస్టర్ నుంచి ప్రశాంత్ ఏఈవో గా బదిలీపై రానున్నారు.
- **టీటీసీ పరీక్షలకు 433 మంది హాజరు-** ఖలీల్‌వాడి, ఆగస్టు 4: జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన టెక్నికల్ టీచర్స్ సర్టిఫికేట్ థియరీ పరీక్షలకు మొత్తం 435 మందికి 433 మంది హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ తెలిపారు.
- **పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి-** డిచ్‌పల్లి, ఆగస్టు 4: మాధవనగర్ బైపాస్ రోడ్డు సమీపంలోని ఓ ఇంటి వద్ద ఆదివారం పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ. 6,990 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి పోలీసులకు అప్పగించారు. దాడుల్లో సీఐ పురుషోత్తం, హెడ్‌కానిస్టేబుల్ సుదర్శన్, లక్ష్మన్న, కానిస్టేబుల్ రాములు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం..

మెదక్ జిల్లాలోని ఏడుపాయల వనదుర్గా మాతను ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్న గారి జీవన్‌రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు.

– ఆర్మూర్‌టౌన్, ఆగస్టు4

డీఐఈవోకు సన్మానం

డీఐఈవోను సన్మానిస్తున్న నాయకులు

బోధన్, ఆగస్టు4: ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాధికారి రవికుమార్‌కు ఆదివారం బోధన్‌లో ఏబీవీపీ బోధన్ శాఖ పూలమొక్కను అందజేసి సన్మానించారు. ఇటీవలే వర్ని కళాశాల నుంచి బోధన్ మధుమలంచ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆయన బదిలీపై వచ్చి విధుల్లో చేరారు. కళాశాల పూర్వ విద్యార్థి అదే కళాశాలకు ప్రిన్సిపాల్‌గా పనిచేయడం, డీఐఈవోగా బాధ్యతలు నిర్వహించడం అభినందనీయమని నాయకులు కొనియాడారు. ఏబీవీపీ పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇండ్ల సూర్యకుమార్, లక్ష్మణ్ చౌహాన్, శివకుమార్ యాదవ్, వినోద్, రమేశ్ పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ, మోదీ చిత్రపటాలకు క్షీరాభిషేకం

వేల్పూర్‌లో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాదిగలు

వేల్పూర్/బోధన్ రూరల్, ఆగస్టు 4: సుప్రీంకోర్టు ఇటీవల ఎస్సీ వర్గీకరణపై సానుకూల తీర్పు ప్రకటించిన నేపథ్యంలో మండల కేంద్రంలో మాదిగ కులసంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం ర్యాలీ చేపట్టారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బోధన్ మండలంలోని పెగడాపల్లి గ్రామంలో మాదిగ సంఘం ప్రతినిధులు డప్పులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మందకృష్ణ మాదిగ, పీఎం మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు కార్యక్రమంలో నాయకులు రామయ్య, రాజారెడ్డి, సాయిలు తదితరులున్నారు.

'ఎస్సీ వర్గీకరణ చేస్తే మాలలకు అన్యాయం'

బోధన్‌లో నిరసన చేపట్టిన మాలమహానాడు నాయకులు, కార్యకర్తలు

బోధన్, ఆగస్టు4: ఎస్సీ వర్గీకరణ చేస్తే తమకు అన్యాయం జరుగుతుందని మాల మహానాడు నాయకులు అన్నారు. ఆసంఘం బోధన్ డివిజన్ నాయకులు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. మాల మహానాడు రాష్ట్ర, జిల్లా నాయకులు నీరడి ఈశ్వర్ కుమార్, చిట్టిడి మోహన్ రావు, వాగ్మారే సూర్యకాంత్, మాదస్తు శ్రవణ్ కుమార్, బోధన్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంపల్లి ఎల్లయ్య తదితరులు మాట్లాడారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. వర్గీకరణపై సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మాలల ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెడుతామని అనడం సిగ్గుచేటన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెడితే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితులను విడగొట్టే చర్యలకు పాల్పడుతున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు కారం స్వామి, పల్నాటి యాదగిరి, డిస్కో సాయిలు, మీర్జాపురం సాయన్న, మధ్యాల లక్ష్మన్, సాలేన్ సంజీవ్, కొప్పర్గ సాయిలు, రాహుల్, విఠల్, అలోక్, గౌతంతో పాటు పలు మండలాలకు చెందిన మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

స్వగ్రామాని చేరిన మృతదేహం

ఆలూర్, ఆగస్టు4: రామచంద్రపల్లికి చెందిన వెంకటి వారం క్రితం మలేషియాలో అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం మృతదేహం స్వగ్రామానికి చేరింది. మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించేందుకు ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి కృషి చేశారని మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు.

గుంతలమయం..

మోర్తాడ్ మండలంలోని వడ్యాట్ శివారులో వడ్యాట్–కమ్మర్‌పల్లి రోడ్డులో చిన్న కల్వర్టు వద్ద రోడ్డుపై నీరు నిలుస్తోంది. నల్ల చెరువు అలుగు నీరు రోడ్డుపై నుంచి పారుతోంది. అక్కడ కల్వర్టు చిన్నగా ఉండడంతో రోడ్డుపైకి నీరు వస్తోంది. ఏటా వర్షాకాలం వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈప్రాంతంలో బ్రిడ్జి నిర్మిస్తే చెరువు నుంచి వచ్చే నీరు సాఫీగా వెళ్లిపోయేందుకు అనువుగా ఉంటుందని గ్రామస్తులు అంటున్నారు.

– మోర్తాడ్, ఆగస్టు4

సీతారాముల ఆలయంలో ఏసీపీ పూజలు

ఆలయం వద్ద అర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి

ఏర్గట్ల, ఆగస్టు 4: తడ్‌పాకల్ గోదావరి గట్టున ఉన్న సీతారాముల ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా అర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఎస్సై మచ్చేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పత్తిరెడ్డి ప్రకాశ్ రెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, కానిస్టేబులు ఉన్నారు.

మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శిగా ఈశ్వర్

ఈశ్వర్

శక్కర్‌నగర్, ఆగస్టు 4: మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శిగా బోధన్‌కు చెందిన న్యాయవాది ఈశ్వర్ ఎన్నికయ్యారు. ఈమేరకు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థి దశనుంచి ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించిన ఈశ్వర్ ప్రస్తుతం న్యాయవాదిగా కొనసాగుతున్నారు. ఎస్సీ రిజర్వేషన్ల విషయంలో మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉద్యమాల్లో ఈశ్వర్ పాత్ర కీలకమని భావించి ఆయనకు రాష్ట్ర కార్యవర్గంలో స్థానం కల్పించారు. తనను రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన జాతీయ అధ్యక్షుడు చెన్నయ్యకు, సహకరించిన వారికి ఈశ్వర్ కృతజ్ఞతలు తెలిపారు.

సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా చౌట్‌పల్లి వాసి

నియామకపు పత్రంతో మహేశ్

మోర్తాడ్, ఆగస్టు4: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ఉద్యోగాన్ని కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి గ్రామానికి చెందిన మహేశ్ సాధించారు. ఈమేరకు సీడీఎంఏ కార్యాలయం హైదరాబాద్‌లో జోనల్‌స్థాయిలో ఎంపికైన అభ్యర్థులకు నియామకపు పత్రాలను అందజేశారు. మహేశ్ కూడా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఉద్యోగం లభించడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు.

24 ఏండ్లకే ఉద్యోగం

సింధూ

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు4: పెర్కిట్‌కు చెందిన మోత్కూరి సింధూ 24 ఏండ్లకే ఉద్యోగం సాధించి ఆదర్శంగా నిలిచింది. ఇటీవల విడుదలైన ఏఈఈ ఫలితాల్లో ఉద్యోగాన్ని సాధించింది. ఆమె ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకు ఆర్మూర్ ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో చదివింది. హైదరాబాద్‌లో డిప్లొమా, పులివెందుల జేఎన్‌టీయూలో బీటెక్ చదివింది. 2023లో పంచాయతీ రాజ్ ఉద్యోగ పరీక్ష రాయగా శుక్రవారం విడుదలైన ఫలితాల్లో ఉద్యోగం సాధించింది. నాన్న నరేశ్‌గౌడ్, మామ సాయి కుమార్ ప్రోత్సహించడంతో పగలూ రాత్రీ కష్టపడి చదివి ర్యాంక్ సాధించినందుకు ఎంతో ఆనందంగా ఉందని ఆమె తెలిపింది. సింధూకు ఉద్యోగం రావడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

నాగేపూర్ యువకుడికి ఏఈఈగా..

నవదీప్‌గౌడ్

నవీపేట, ఆగస్టు4: మండలంలోని నాగేపూర్ గ్రామానికి చెందిన అబ్బోగోని లక్ష్మీనారాయణ, జ్యోతి దంపతుల ఏకైక కుమారుడు నవదీప్‌గౌడ్ ఇటీవల విడుదలైన పంచాయతీ రాజ్ శాఖలో ఏఈఈగా ప్రభుత్వ ఉద్యోగం సాధించాడు. జన్నేపల్లి ఎస్ఎస్ఆర్ స్కూల్‌లో పదోతరగతి వరకు, ఇంటర్, బీటెక్ హైదరాబాద్‌లో చదివాడు. కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో ఎంటెక్ పూర్తి చేశాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో టీసీఎస్ ఉద్యోగం చేస్తూ ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా కష్టపడి చదివి అనుకున్నది సాధించాడు.

బురదమయం..

డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి–జీజీ నడ్కుడ రోడ్డు గుంతలు, బురదతో అధ్వానంగా మారింది. 15 రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు రోడ్డుపై నిలిచింది. గుంతల వద్ద పోసిన మట్టి మురికికూపంగా మారింది. ఆ మట్టిలో వాహనాలు దిగబడుతున్నాయి. సుమారు మూడు కిలోమీటర్ల మేర గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. – నందిపేట్, ఆగస్టు 4

రెంజల్ మండలంలోని కందకుర్తి సరిహద్దులో ఏర్పాటు చేసిన ఎక్సైజ్ చెక్‌పోస్టు మందుబాబులకు అడ్డాగా మారింది. శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పలు శా